# నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, శుక్రవారం 10 జనవరి 2025 | SANGAREDDY




సిద్దిపేటలో మీడియాతో మాట్లాడుతున్న కొండం సంపత్‌రెడ్డి

## కేటీఆర్‌పై అక్రమ కేసులు అప్రజాస్వామికం

- బీఆర్‌ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి

సిద్దిపేట, జనవరి 9: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించడం పూర్తిగా అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కేటీఆర్‌పై నమోదు చేసిన కేసులో ఏమీ లేదని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారని గుర్తుచేశారు. కేటీఆర్ వెంట తన లాయర్ విచారణకు హాజరైతే వారికి వచ్చే నష్టం ఏంటో చెప్పాలన్నారు. గతంలో తమ పార్టీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి లాయర్‌ను తీసుకెళ్లకుండా విచారణకు వెళ్తే ఒప్పుకోనివి కూడా ఒప్పుకున్నట్లు అభియోగాలు మోపారన్నారు. గతంలో రేవంత్‌రెడ్డి రూ.50లక్షలు ఇస్తూ ఏసీబీకి పట్టుబడి, ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లారని, దానిని మనస్సులో పెట్టుకుని కక్షపూరితంగా కేటీఆర్‌ను జైల్లో పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ ఇప్పటికైనా ఇలాంటి పనికిమాలిన చర్యలు మానుకోవాలని, రాజ్యాంగబద్ధంగా పరిపాలన కొనసాగించాలని హితువు పలికారు. తప్పుడు కేసులకు బీఆర్‌ఎస్ భయపడదన్నారు. గతంలో తాము తెలంగాణ ఉద్యమంలో అనేక కేసులను ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించిన విషయాన్ని గుర్తుచేశారు. అక్రమ కేసులపై బీఆర్‌ఎస్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం హామీలను ఆమలు చేయకుండా ప్రజల దృష్టి మరల్చేందుకు నిత్యం కేసులను తెరపైకి తెస్తున్నదని కొండం సంపత్‌రెడ్డి విమర్శించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు సతీష్, ప్రభాకర్‌రెడ్డి, మోహిజ్, భానుచందర్ గౌడ్, సయ్యద్, కుమార్ పలువురు పాల్గొన్నారు.



మునిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10గంటలకు స్వాగతం పలుకుతున్న ఖాళీ కుర్చీలు

## అంతా మాఇష్టం..

మునిపల్లి, జనవరి 9: మా ఉద్యోగం మా ఇష్టం.. మేము ఇష్టం వచ్చినప్పుడు వస్తం... మాఇష్టం వచ్చినప్పుడు పోతం, మమ్మల్ని ఎవరూ ఏమి చెయ్యలేరు... అన్నట్లు వ్యవహరిస్తున్నారు మునిపల్లి మండల పరిషత్ సిబ్బంది. ఉదయం 10 గంటల వరకు కార్యాలయాలకు రావాల్సిన అధికారులు, సిబ్బంది.. ఉదయం 11 దాటిన తర్వాత కార్యాలయానికి వస్తున్నారు. గురువారం సైతం కార్యాలయంలో ఇదే పరిస్థితి కనిపించింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే మండల పరిషత్ సిబ్బంది విధులకు ఇష్టారాజ్యంగా వస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల పరిషత్ కార్యాయాలనికి వస్తే అధికారులు అందుబాటులో ఉండకపోవడంతో విసుగు చెంది వెనుతిరుగుతున్నారు. సమయపాలన పాటించని సిబ్బందిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



రాయపోల్ మండలం తిమ్మక్కపల్లిలో విరగపూసిన మామిడి పూత

## మామిడికి మస్తు పూత

సీజన్‌కు ముందే మామిడి పూత విరగబూసింది. పూలతో అలంకరించినట్లుగా మామిడి చెట్లు దర్శనమిస్తున్నాయి. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని తిమ్మక్కపల్లి, రాయపోల్, కొత్తపల్లి, రామారం, గొల్లపల్లి గ్రామాల శివారుల్లోని పలు పంటపొలాల్లో మామిడి చెట్లకు విపరీతంగా పూత పూసింది. ఈ మామిడి చెట్లు అటుగా వెళ్లేవారిని ఆకట్టుకుంటున్నాయి. జనవరిలోనే మామిడి చెట్లు పూతకు రావడంతో బాగా కాత వస్తుందని మామిడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– రాయపోల్, జనవరి 9



హద్నూర్‌లో చలిమంట కాచుకుంటున్న ప్రజలు

## చలితో వణుకుతున్న జనం

జహీరాబాద్, జనవరి 9: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గురువారం జిల్లాలోని కోహీర్‌లో 6.9, న్యాల్‌కల్‌లో 7.4, అల్గోల్‌లో 8.8, ఝరాసంగంలో9.1, మల్చేల్మాలో 9.2, జహీరాబాద్, సత్వార్‌లో 10.1, దిగ్వాల్‌లో 10.2, మొగుడంపల్లిలో 11.1 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 5 గంటల నుంచి 8 వరకు దట్టంగా పొగమంచు కురుస్తుండడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం పనులకు వెళ్లే రైతులు, కూలీలు, పారిశుధ్య కార్మికులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు చలికి వణికిపోతున్నారు. సాయంత్రం కాగానే ఇంటికి చేరుకుంటున్నారు. ప్రధాన రోడ్లు రాత్రి 9గంటలకే నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక రోగులు తగు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

# గుడ్డు మాయం..!

## మధ్యాహ్న భోజనంలో వడ్డించని గుడ్డు

- నెలల తరబడి గుడ్ల బిల్లులు పెండింగ్
- ప్రభుత్వం గుడ్డుకు రూ.5 చెల్లిస్తే.. మార్కెట్‌లో రూ.7 ధర
- మధ్యాహ్న భోజన కార్మికులపై గుడ్డుపై అదనంగా రూ. 2 భారం
- పెరిగిన ధరలు, బిల్లుల పెండింగ్ కారణమంటున్న వంట కార్మికులు
- పదో తరగతి విద్యార్థులకు అందని అల్పాహారం
- అర్ధాకలితో సాగుతున్న చదువులు





సిద్దిపేట, జనవరి 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి): విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతున్నది.అర్ధాకలితో విద్యార్థులు విద్యనభ్యసించాల్సిన దుస్థితి ఏర్పడింది. బీఆర్‌ఎస్ హయాంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజనంలో భాగంగా విద్యార్థులకు వారంలో మూడు రోజుల పాటు గుడ్డును పెట్టారు. ఇప్పుడు కూడా అదే విధానం కొనసాగుతున్నది. కానీ, ప్రస్తుత ప్రభుత్వం భోజన నిర్వాహకులకు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గుడ్డు పెట్టడం లేదని తెలిసింది. బిల్లులు పెండింగ్‌తో పాటు గుడ్డు ధరలు విపరీతంగా పెరగడంతో చాలాచోట్ల గుడ్డు మెనూ సరిగా అమలు కావడం లేదంటూ విద్యార్థులు చెబుతున్నారు. సిద్దిపేట జిల్లాలో 1013 ప్రభుత్వ పాఠశాలల్లో 86,197 మంది విద్యార్థులు, మెదక్ జిల్లాలో 902 ప్రభుత్వ పాఠశాలల్లో 91,715 మంది విద్యార్థులు, సంగారెడ్డి జిల్లాలో 1247 ప్రభుత్వ పాఠశాలల్లో 1.17 లక్షల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

### పూర్తిగా అమలు కాని మెనూ ...

ప్రభుత్వ పాఠశాలల్లో గుడ్డు మెనూ పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు.దీనికి ప్రధాన కారణం మార్కెట్‌లో గుడ్డు ధరలు పెరగడంతో ప్రభుత్వం తక్కువ ధర కట్టివ్వడంతో పాటు నెలల తరడబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడం ప్రధాన కారణం అని తెలుస్తోంది. ప్రాథమిక బడులతో పాటు ఆదర్శ పాఠశాలలు, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నారు. వీరి ఆకలి తీర్చడంతో పాటు వారానికి మూడు రోజులు మధ్యాహ్న భోజనంలో గుడ్డును పెడుతున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో విద్యార్థులకు గుడ్డు పెట్టాలని నిర్ణయించారు. ప్రభుత్వం భోజన నిర్వాహకులకు ఒక గుడ్డుకు రూ. 5 చెల్లిస్తున్నది. మార్కెట్‌లో గుడ్డు ధర రూ. 7 నుంచి రూ.7.50 ధర పలుకుతున్నది. దీంతో అదనంగా రూ.2 నుంచి రూ 2.50 వరకు భారం భరించాల్సి వస్తున్నదని భోజన నిర్వాహకులు వాపోతున్నారు. పైగా బిల్లులు సకాలంలో రావడం లేదని భోజన నిర్వహణ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో బయట అప్పులు తెచ్చి గుడ్డు పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వారు చెబుతున్నారు. తాము చేసిన కష్టం వడ్డీ చెల్లింపులకే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అన్ని రకాలుగా తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తెలుపుతున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలంటే వారికి పూర్తిస్థాయిలో మధ్యాహ్న భోజన మెనూ అమలు చేయాలి. నెలల తరబడి బిల్లులు పెండింగ్‌తో పాటు విపరీతంగా పెరిగిన ధరలతో వారంలో మూడు రోజులు పూర్తిస్థాయిలో గుడ్డు పెట్టలేకపోతున్నామని కార్మికులు చెబుతున్నారు. కొన్ని పాఠశాలల్లో వారంలో మూడు రోజులు గుడ్డు అమలు అవుతున్నది. ఎక్కువ విద్యార్థులు ఉన్న చోట వారంలో మూడు రోజులు గుడ్డు పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయడంతో పాటు గుడ్డు ధరలను మార్కెట్ ధరలకు అనుగుణంగా చెలించాలని భోజన నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు.

### పదోతరగతి విద్యార్థులకు అందని అల్పాహారం

పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం అల్పాహారం అందించడం లేదు. ఉదయమే దూర ప్రాంతాల నుంచి పాఠశాలకు విద్యార్థులు చేరుకుంటారు. పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతుండడంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వీరు ఉదయమే 8.30 గంటలకు వరకు పాఠశాలకు చేరుకోవాలి. పాఠశాలకు సమయానికి చేరుకోవాలి కాబట్టి ఉదయం ఏడు గంటలకే దూర ప్రాంతాల విద్యార్థులు పాఠశాలకు బయలు దేరుతారు. వీరు ఇంటి వద్ద ఏం తినకుండానే పాఠశాలకు వస్తారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో విద్యార్థులకు ఉదయం స్నాక్స్ అందించే వారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. కొన్ని పాఠశాలల్లో మాత్రం దాతల సహకారంతో స్నాక్స్ అందిస్తున్నారు. ఉదయం ఏడు గంటలకు వచ్చిన పిల్లలు మధ్యాహ్నం వరకు ఆగాల్సిందే. అప్పటి వరకు అర్ధాకలితో విద్యను అభ్యసించాల్సి వస్తున్నది. సాయంత్రం కూడా స్నాక్స్ ఇవ్వడం లేదు. మధ్యాహ్న భోజనంతోనే సరిపెట్టుకోవాల్సి వస్తున్నది. ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి వచ్చిన విద్యార్థి రాత్రి 7గంటల వరకు చేరుకుంటున్నారు. దీంతో ఒక్కపూటకే పరిమితం అవుతున్నారు. దీంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టాల్సిన ప్రభుత్వం విద్యార్థులను అర్ధాకలితో అలమటిస్తున్నది.

# శంకుస్థాపనలతో సరి!

- పనుల ప్రారంభమెప్పుడో..?
- మంత్రి భూమిపూజ చేసినా ముందుకు సాగని పనులు
- హుస్నాబాద్‌లో పడకేసిన ప్రగతి
- ఇబ్బందుల్లో ప్రజలు



హుస్నాబాద్‌లోని మూడోవార్డులో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులు

హుస్నాబాద్ టౌన్, జనవరి 9: వచ్చిన నిధులకు రెండుసార్లు అట్టహాసంగా మంత్రి, ఉన్నతాధికారులు కలిసి శంకుస్థాపనలు చేశారు. కానీ, నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. ఇదేమిటని ప్రశ్నిస్తే వర్క్ ఏజెన్సీ వారు స్పందించడం లేదని ముక్తసరి సమాధానం ఇస్తున్నారు హుస్నాబాద్ బల్దియా అధికారులు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణాన్ని ప్రగతి పథంలో తీసుకువెళ్లాలనే ఆశయం గొప్పదైనప్పటికీ, ఆచరణలో మాత్రం పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంది. స్వయంగా మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేసినా పనుల్లో పురోగతి ఉండడం లేదు. హుస్నాబాద్ పట్టణంలోని పలు అభివృద్ధి పనులకు మంజూరైన నిధులకు గతేడాది మార్చిలో ఒకసారి, వార్డుల వారీగా గతేడాది నవంబర్ 7న రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం, కలెక్టర్ మను చౌదరి శంకుస్థాపనలు చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టీయూఎఫ్ఐడీసీ కింద వార్డుకు రూ. 50 లక్షల చొప్పున నిధులు కేటాయించారు. ఈ నిధులతో సీసీరోడ్లు, మురుగు కాల్వల పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులకు సంబంధించి ఆన్‌లైన్‌లో టెండర్లు పెట్టి వర్క్ ఏజెన్సీలకు సైతం అప్పగించి మూడు నెలలపైనే గడిచిపోయింది. ఈ పనుల్లో 15 వార్డుల పనులను ఇన్‌ఫ్రా ఏజెన్సీకి అప్పగించగా, మరో 5వ వార్డుల్లో పనులను మరో వర్క్ ఏజెన్సీకి ఇంజినీరింగ్ అధికారులు అప్పగించారు. డిసెంబర్ 7న వార్డుల్లోని పలు పనులకు మంత్రి,కలెక్టర్ ఆధ్వర్యంలో శంకుస్థాపనలు చేశారు. ఈ పనులు త్వరితగతిన పూర్తిచేయాలనే ఆదేశాలు సైతం జారీచేశారు. కానీ, వర్క్ ఏజెన్సీలు పనులు చేపట్టేందుకు ముందుకే రావడం లేదు.ఇంజినీరింగ్ అధికారులు సంప్రదించినప్పటికీ స్పందించడం లేదని తెలుస్తోంది. ఈ విషయాన్ని ఇంజినీరింగ్ ఉన్నతాధికారులకు సమాచారం అందించిగా, వారు సంప్రదించినా ఫలితం కనిపించడం లేదు. పనులను ప్రారంభించాలని ఎంత ఒత్తిళ్లు చేసినా కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదని చెబుతున్నారని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఈ పరిస్థితిపై మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జోక్యం చేసుకుని పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### నోటీసులు జారీచేస్తున్నాం..

హుస్నాబాద్ పట్టణానికి టీయూఎఫ్ఐడీసీకి కెందిన మంజూరైన రూ.40 కోట్ల పనులు చేపట్టని వర్క్ ఏజెన్సీలకు నోటీసులు జారీచేస్తున్నాం. ఏజెన్సీల తీరుపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. పలుమార్లు సంప్రదించినప్పటికీ ఏజెన్సీ వారి నుంచి స్పందన కనిపించడం లేదు.

– పృథ్వీరాజు, మున్సిపల్ ఏఈ

## పరిశీలన తర్వాతే పరిశ్రమలకు అనుమతి

- అధికారులతో కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 9: జిల్లాలో పరిశ్రమలకు అనుమతులు ఇచ్చేముందు సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరపాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీజీఐపాస్‌పై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమలోని కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల శ్రేయస్సు, ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక తనిఖీలు చేపట్టాలన్నారు. ప్రతినెలా సమావేశానికి ముందు చెక్ లిస్ట్ సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, ఆర్డీవో రవీందర్ రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి పాల్గొన్నారు.

### సాగుకు యోగ్యం కాని భూముల్లో పవర్ ప్లాంట్లు..

జిల్లాలోని వ్యవసాయానికి యోగ్యం కాని భూముల్లో పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి తెలిపారు. మహిళా సంఘాల సభ్యులచే సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం గురువారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సంబంధిత శాఖల అధికారులు, మహిళా సంఘాలతో కలెక్టర్ సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 50 గ్రామ సంఘాల ద్వారా 150 ఎకరాల్లో మొదటి విడతగా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయించినట్లు తెలిపారు. విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్‌కు చాలా డిమాండ్ ఉన్నదన్నారు. 150 ఎకరాల భూమి కోసం వినియోగంలో లేని, ప్రభుత్వ, ప్రైవేటు భూములు, దేవాదాయ, ఆటవీ శాఖ భూములు, సొంత భూములను గుర్తించాలన్నారు. ఈనెల 18నాటికి పూర్తి వివరాలు పంపించాలన్నారు.

### గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి..

గణతంత్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని యంత్రాంగాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్య అతిథులుగా రాజకీయ ప్రముఖులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, సంఘ సేవకులను ఆహ్వానించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతిశాఖ తమ బాధ్యతగా సమయానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజా రాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దుద్దెడ గురుకులంలో దారుణం

## స్టడీ అవర్‌కు ఆలస్యంగా వచ్చారంటూ విద్యార్థులను చితకబాదిన పీడీ

- 30మంది విద్యార్థులకు వాతలు

గజ్వేల్, జనవరి 9: సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలోని దుద్దెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో గురువారం దారుణం చోటు చేసుకుంది. తెల్లవారుజామున స్టడీ అవర్‌కు ఆలస్యంగా వచ్చారని ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) 30మంది విద్యార్థులను వరుస క్రమంలో నిలబెట్టి కర్రతో చితకబాదాడు. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులకు తీవ్రంగా గాయాలవడంతో గుట్టుచప్పుడు కాకుండా సిద్దిపేట దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. వివరాలు.. దుద్దెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ప్రతిరోజు విద్యార్థులను వాచ్‌మెన్ ఉదయం 5గంటలకు నిద్రలేవాల్సి ఉండగా, గురువారం ఆలస్యంగా 5.40 గంటలకు లేపారు. దీంతో పాటు చలి తీవ్రంగా ఉండడంతో స్టడీ అవర్‌కు పది నిమిషాలు విద్యార్థులు ఆలస్యంగా వెళ్లారు. ఎందుకు ఆలస్యం అయ్యిదంటూ విద్యార్థులపై పీడీ వాసు ఆగ్రహం వ్యక్తం చేసి కర్రతో చితకబాదాడు. దీంతో పలువురికి వాతలు అయ్యాయి. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఇష్టం వచ్చినట్లు కర్రతో చితకబాదడంతో దెబ్బల తీవ్రతకు కొందరి నడుము కింది భాగంలో వాతలు వచ్చాయి. మరికొందరు విద్యార్థుల కాళ్లు, చేతులకు గాయాలవడంతో ఇబ్బంది పడ్డారు. గాయపడిన ఇద్దరు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా సిద్దిపేటలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. పాఠశాలకు వచ్చిన తరువాత విద్యార్థులకు కూర్చోవడం ఇబ్బందికరంగా ఉండడంతో వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని వారి పిల్లల శరీరంపై ఉన్న గాయాలను చూసి చలించిపోయారు. గతంలో కూడా పీడీ వాసు విద్యార్థులను ఇలాగే చితకబాదితే తల్లిదండ్రులు గురుకులాల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రెండోసారి జరిగిన సంఘటనతో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా మండిపడ్డారు.

### ఫిజికల్ డైరెక్టర్ మాకొద్దు..

- జడ్జి ఎదుట గోడు వెళ్లబోసుకున్న విద్యార్థులు
- విద్యార్థులను చితకబాదిన సంఘటనపై విచారణ

గజ్వేల్/కొండపాక, జనవరి 9: కొండపాక మండలంలోని దుద్దెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ, జడ్జి స్వాతిరెడ్డి గురువారం సందర్శించి విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ చితకబాదిన ఘటనపై విచారణ చేపట్టారు. ఉదయం స్టడీ అవర్‌కు అరగంట ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను తీవ్రంగా కొట్టడంతో గాయాలై దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి గురుకుల పాఠశాలను సందర్శించారు. పీడీ విద్యార్థులను కొట్టడానికి గల కారణాలను తెలుసుకొని పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థులు ఫిజికల్ డైరెక్టర్ వాసు మాకొద్దంటూ రాతపూర్వకంగా రాసిచ్చారు. గురుకుల పాఠశాలలోని స్నానాల గదులు, మూత్రశాలల నుంచి దుర్వాసన రావడంతో కలెక్టర్‌కు పూర్తి సమాచారం అందిస్తామని తెలిపారు. పీడీ వాసు బుధవారం విద్యార్థులను కర్రతో కొట్టడంతో బొబ్బలు వచ్చాయి. దీంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో విషయం బయటకొచ్చింది.



విచారణ సమయంలో దుద్దెడ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో మూత్రశాలల నుంచి దుర్వాసన వస్తుండడంతో ముక్కుకు కర్చీఫ్ పెట్టుకొని వెళ్తున్న జడ్జి స్వాతిరెడ్డి

### భయంకర వాతావరణంలో గురుకులాలు

- విద్యార్థులను పైశాచికంగా చితకబాదిన పీడీపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలి
- బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



కొండపాక గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), జనవరి 9: కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో భయంకరమైన వాతావరణంలో గురుకుల పాఠశాలలు కొనసాగుతున్నాయని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం కొండపాక గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల పీడీ వాసు విద్యార్థులకు ఆటలు, క్రమశిక్షణ నేర్పించాల్సింది పోయి స్టడీ అవర్స్‌కు అలస్యంగా వచ్చారని వాతలు వచ్చేలా విద్యార్థులను చితకబాదడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్ స్పందించి విద్యార్థులను పైశాచికంగా చితకబాదిన పీడీ వాసుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఉద్యోగం నుంచి సస్పెండ్ చేయాలన్నారు. గురుకుల పాఠశాలలో పేద విద్యార్థులు తెలంగాణ నలుమూలల నుంచి వచ్చి చదువుతున్నారని, వారిని ప్రేమతో, ఆప్యాయంగా పలుకరించి సరైన పద్ధతిలో నచ్చజెప్పి భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సింది పోయి, సోయిలేకుండా చితక బాధడంపై ఆవేదన వ్యక్తం చేశారు. తను విద్యార్థులతో మాట్లాడుతుంటే వారు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. వారిలో అభద్రతాభావం కనిపిస్తోందని వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి గురుకుల పాఠశాలల విద్యార్థులకు స్వేచ్ఛ లేకుండా పోయిందన్నారు. తరుచూ ఫుడ్ పాయిజన్, పాము కాటు, ఇష్యూలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యార్థులను కలిసేందుకు వారి తల్లిదండ్రులు వస్తే కలవనీయకపోవడం దారుణమని, ఇది రేవంత్‌రెడ్డి సర్కార్‌కు సిగ్గుచేటన్నారు. గతంలో బీఆర్‌ఎస్ హయాంలో గురుకులాలు స్వేచ్ఛగా నడిచిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటీవల అసెంబ్లీలో సైతం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలు కాకుండా చూడాలని, స్నేహపూర్వకమైన వాతావరణంలో విద్యను అందించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయిన విషయాన్ని గుర్తుచేశారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని చదువుతున్నారని, వారికి తగిన వసతులతో కూడిన విద్యను అందజేయాలన్నారు. గురుకులాల్లో నెలకొన్న సమస్యలపై బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని వంటేరు ప్రతాప్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ రాణీసత్యనారాయణ గౌడ్ ఉన్నారు.

# ‘ఉపాధి హామీ’లో అక్రమాలు

## సామాజిక తనిఖీలో బట్టబయలు.. రికవరీకి ఆదేశించిన అధికారులు

- ‘నమస్తే తెలంగాణ’ కథనంపై చర్చ



సామాజిక తనిఖీలో వివరాలు వెల్లడిస్తున్న తనిఖీ బృందం

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 9: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ (ఈజీఎస్) పథకంలో జరిగిన రూ.9.60 కోట్లతో చేసిన 1122 పనులకు సామాజిక తనిఖీ నిర్వహించారు. గురువారం మద్దూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఉపాధిహామీలో లక్షలాది రూపాయలు అక్రమాలు జరిగినట్లు తనిఖీ బృందం వెల్లడించింది. ప్రధానంగా పని జరగకపోయినా పని జరిగినట్లు రికార్డుల్లో పొందుపర్చడం, మస్టర్‌లో సంతకాలు లేకుండా చెల్లింపులు చేయడం, తక్కువ పనికి ఎక్కువ చెల్లింపులు జరిగినట్లు తనిఖీ బృందం నిర్ధారించింది. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడం, జాబ్‌కార్డులు అప్‌గ్రేడ్ చేయకపోవడం, కూలీలకు పేస్లిప్‌లు అందజేయకపోవడం, ఏడు రకాల రిజిస్టర్లను నిర్వహించకపోవడంపై వీఆర్పీలు ప్రజావేదికలో నివేదించారు.

### ఉన్నతాధికారుల దృష్టికి ‘నేమ్‌బోర్డుల’ అంశం...

ఉపాధిహామీ పథకంలో జరిగిన పని వివరాలు పారదర్శకంగా ఉండాలనే ఉద్దేశంతో పని ప్రదేశంలో పని వివరాలను నేమ్‌బోర్డులో పొందుపర్చి, పని ప్రదేశంలో నేమ్‌బోర్డులను ఏర్పాటు చేయాలని ఉపాధిహామీ చట్టంలో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ అదేమీ తమకు పట్టదన్నట్లుగా ఉపాధిహామీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైనంపై గురువారం ‘నమస్తే తెలంగాణ దిన పత్రిక’ జిల్లా ఎడిషన్‌లో ‘ఈజీఎస్ నేమ్ బోర్డులపై నిర్లక్ష్యమేలా..’’అని కథనాన్ని ప్రచురించిది. నేమ్‌బోర్డుల అంశాన్ని సామాజిక తనిఖీ బృందం సైతం ప్రజావేదిక దృష్టికి తీసుకవచ్చింది. ఎనిమిది నెలల కాలంలో సుమారు 350 పనులకు రూ. 1300 చొప్పున శ్లోక ఎంటర్‌ప్రైజెస్‌తో పాటు మరో వ్యక్తికి చెందిన సంస్థకు ఈజీఎస్ ద్వారా రూ.45,500 చెల్లింపులు జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. చెల్లింపులు జరిగినప్పటికీ పని ప్రదేశంలో నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంస్థలతో పాటు అధికారులపై చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు. సామాజిక తనిఖీలో అడిషనల్ డీఆర్డీవో బాలకృష్ణ, ఏపీడీ శ్రీనివాస్ గౌడ్, ఎంపీడీవో రామ్మోహన్, క్యూసీ సంతోశ్, పీఆర్ ఏఈ వినయ్‌కుమార్, ఈసీ పరశురాములు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.